

ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 11 మార్చి 2025





ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న మేయర్ నీరజ, కార్పొరేటర్లు

అందమైన పుణె అబ్బురపరిచింది...

- ఆ నగర స్ఫూర్తితో ఖమ్మం అభివృద్ధికి కృషి
- ప్రజలు సహకరిస్తే 'క్లీన్ ఖమ్మం' సాకారమవుతుంది..
- ముత్తమాల నది తరహాలో మున్నేరును అభివృద్ధి చేస్తాం
- విహారయాత్రకు వెళ్లారనడం అర్ధరహితం: మేయర్ నీరజ

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో పుణె నగరం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందటంతో రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వుల మేరకు మూడు రోజుల పాటు పర్యటించామని, తాము వెళ్లింది క్లీన్ ఖమ్మం కార్యాచరణ కోసమని, విహార యాత్రకు కాదని నగర మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. కేఎంసీలోని తన చాంబర్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 41 మంది కార్పొరేటర్లు, అధికారులతో కలిసి మూడు రోజుల పాటు పుణె అధ్యయన యాత్రలో పాల్గొన్నామని వివరించారు. అండర్ డ్రెయినేజీ విధానం అమలును పరిశీలించామని, ఇంటింటి చెత్త సేకరణకు తీసుకున్న కార్యాచరణను క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. స్వచ్ఛ సంఘాలు ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి, ప్లాస్టిక్, హానికరమైన వ్యర్థాలను సేకరిస్తూ వాటి నుంచి (మిగతా 6వ పేజీలో)

మంచుకొండ తలంబ్రాలకు శ్రీకారం



మంచుకొండ రామాలయంలో గోటితో తలంబ్రాలు వలుస్తున్న భక్తులు

రఘునాథపాలెం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ప్రతి సంవత్సరం నిర్వహించే శ్రీరామనవమికి రఘునాథపాలెం మండలం మంచుకొండ రామాలయం నుంచి గోటితో వలిచిన తలంబ్రాలు తీసుకెళ్లడం అనవాయితీగా వస్తుంది. ఈ సంవత్సరం కూడా మంచుకొండ నుంచి శ్రీరామనవమికి గోటితో వలిచిన తలంబ్రాలను పంపేందుకు సోమవారం నుంచి కార్యక్రమం ప్రారంభించారు. మంచుకొండ శ్రీరామాలయం భక్త బృందం ఆధ్వర్యంలో తలంబ్రాలను గోటితో వలవటం ప్రారంభించారు. మూడు రోజులు పాటు గోటితో వలిచి అనంతరం భద్రాచలం సీతారామాలయానికి అధికారికంగా పంపుతారు.

చెంతనే నీళ్లు పారుతున్నా.. తమ పంటలు మాత్రం ఎండుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా మేజర్ కాల్వలకు సాగర్ నీళ్లు వదలకపోవడం శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎండిపోతున్నాయని మొర పెట్టుకుంటున్నా కనికరించటంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మేజర్ కాల్వల తూముల వద్దకు వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. రాత్రింబవళ్లు కాల్వలపై పడిగాపులు కాస్తూ తూములు తెరిచేందుకు ప్రయత్నం చేస్తుంటే, తూముల జోలికి వస్తే కేసులు పెట్టాల్సి వస్తుందని అధికారులు బెదిరిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.



చిన్నమునగాలలో ఎండుతున్న వరిని పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఇరిగేషన్.. ఇరిటేషన్..

నీటి పారుదల శాఖ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

- వైరా, రాపల్లె మేజర్ కాల్వల పరిధిలోని పొలాలకు సాగర్ నీళ్లు వదలని వైనం
- వందలాది ఎకరాల్లో ఎండుతున్న వరి, మొక్కజొన్న
- తూముల వద్ద రైతుల ఆందోళనలు
- రైతులు ఓపిక పట్టాలంటున్న అధికారులు
- పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు

కొణిజర్ల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలంలోని బోనకల్ బ్రాంచ్ కెనాల్ కాల్వ పరిధిలో వైరా మేజర్, రాపల్లె మేజర్‌కాల్వలు ఉన్నాయి. ఈ రెండు మేజర్‌ల పరిధిలో 10 వేల ఎకరాలకు పైగా రైతులు వరి, మొక్కజొన్న పంటలను సాగు చేసి ఉన్నారు. పంటలన్నీ సాగర్ జలాలపైనే ఆధారపడి ఉన్నాయి. ఒక్క రాపల్లె మేజర్‌కాల్వ పరిధిలోనే 6,500 ఎకరాల్లో వరిని సాగు చేశారు. ఇక మొక్కజొన్న రెండు మేజర్‌ల పరిధిలో 8వేల ఎకరాల్లో సాగు చేశారు. వరి, మొక్కజొన్న పంటలకు ప్రస్తుతం నీళ్ల అవసరం ఎక్కువగా ఉండటంతో రైతులు ఎండుతున్న పంటలను చూసి తట్టుకోలేకపోతున్నారు. తమ పొలాల చెంత నుంచి బోనకల్ బ్రాంచ్ కెనాల్ (బీబీసీ)కు నీళ్లు పుష్కలంగా పోతున్నప్పటికీ మేజర్‌లకు ఎందుకు ఇవ్వడం లేదని ఆవేదన చెందుతున్నారు. పై భూములకు నీళ్లు ఇవ్వకుండా కిందకు నీళ్లను తీసుకెళ్లుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తమ పంటలు ఎండిపోతే పూర్తి బాధ్యత నీటిపారుదల శాఖ అధికారులదేనని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేజర్ కాల్వలకు నీరు ఎందుకు వదలడం లేదని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదని ఆరోపించారు.

రాపల్లె మేజర్‌కాల్వ ఆయుకట్టులో వరిసాగు చేసిన రైతుల పొలాలు నీళ్లు లేక నెర్రలు బారుతున్నాయి. రెండు రోజులు ఇలాగే నీళ్లు లేకపోతే పంట కళ్ల ముందు ఎండిపోతుందని, పూర్తిగా ఆశలు వదులుకోవలసి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. బోనకల్ బ్రాంచ్‌కు పుష్కలంగా నీళ్లు వచ్చినా మేజర్‌కాల్వల తూములను బంద్ చేయటం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వైరా మేజర్ కాల్వ పరిధి ఆయకట్టు రైతులు తూము వద్దకు వచ్చి ఆందోళన చేయగా, సోమవారం రాపల్లె మేజర్‌కాల్వ ఆయకట్టు పరిధిలోని పెద్దమునగాల, చిన్నమునగాల తదితర గ్రామాల రైతులు రాపల్లె మేజర్ తూము వద్ద ఆందోళన చేశారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ గౌతమిశిల్ప మాట్లాడుతూ రాపల్లె మేజర్‌కాల్వ పరిధిలో పంటలు ఎండిపోతున్నాయనే రైతులు ఆవేదనను నీటిపారుదలశాఖ సీఈ దృష్టికి తీసుకెళ్లామని, మంగళవారం మధ్యాహ్నం వరకు ఇద్దామని తెలిపారని అన్నారు. రైతులు ఒక్క రోజు ఓపిక పట్టాలని కోరారు.



మేజర్ కాల్వలో నీటి ప్రవాహం లేని దృశ్యం



రాపల్లె మేజర్‌కాల్వ పరిధిలో నీళ్లలేక నెర్రెలు బారిన వరి పొలం

వ్యవసాయశాఖ అధికారుల రాక

తమ పంటలు ఎండిపోతున్నాయని రైతులు వ్యవసాయశాఖ అధికారులకు తెలపగా సోమవారం వ్యవసాయశాఖ ఏడీఏ కరుణశ్రీ, మండల వ్యవసాయశాఖ అధికారి బాలాజీ రాపల్లె మేజర్‌కాల్వ పరిధిలోని చిన్నమునగాలలో ఎండుతున్న వరి పంటలను పరిశీలించారు. రైతులకు నీటి అవసరం చాలా ఉందని ఏవో బాలాజీ తెలిపారు. రైతుల బాధను ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళుతున్నామన్నారు. నీళ్లు వదలకపోతే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు.



ఎల్‌ఆర్‌ఎస్‌కు హెల్ప్‌డెస్క్

- 31లోగా రెగ్యులరైజేషన్ చేసుకుంటే 25శాతం రాయితీ
- జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) అమలుకు సంబంధించి జిలా రిజిస్ట్రార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ రావు తెలిపారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎల్‌ఆర్ ఎస్‌పై అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ 2020లో 25 వేలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయని, వాటి పరిష్కార విషయమై కలెక్టర్ ఆధ్వర్యంలో కసరత్తు (మిగతా 6వ పేజీలో)

ఇద్దరు చిట్‌ఫండ్ డైరెక్టర్ల అరెస్ట్

ఖమ్మం క్రైం మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా నగరంలో ప్రైవేటు చిట్స్ నిర్వహిస్తూ రూ.2కోట్లకుపైగా మోసంచేసి చిట్టీ బాధితుల నుంచి తప్పించుకొని తిరుగుతున్న నిక్షిప్త చిట్‌ఫండ్ డైరెక్టర్లు సంగిశెట్టి కరుణాకర్, మూల ఉమామహేశ్వర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. సుమారు 42 మంది చిట్టీదారులకు ఇవ్వవలసిన రూ.2కోట్ల 17లక్షలు ఇవ్వకుండా ఫోన్లు స్విచ్‌ఆఫ్‌చేసి తప్పించుకొని తిరుగుతున్నారని, ఇటీవల మరిపెడబంగ్లాకు చెందిన భూక్యా శ్రీనివాస్ అనే బాధితుడు ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, విశ్వసనీయ సమాచారం మేరకు వీడియోస్ కాలనీలో ఉన్న వీరిద్దరిని సోమవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

హామీల అమలు పట్టని సర్కారు

- 20 నుంచి 30వ తేదీ వరకు మండల కేంద్రాల్లో ఆందోళనలు
- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

వివరాలు : 6లో



వీసీలో మాట్లాడుతున్న మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌కుమార్ రెడ్డి

రబీ పంటలకు నీటి ఎద్దడి రావొద్దు...

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల



గాయపడిన కానిస్టేబుల్ నరేష్

కానిస్టేబుల్‌పై దొంగ దాడి

- నిందితుడికి పలు చోరీ కేసులతో సంబంధం
- తనను అనుసరిస్తున్నాడనే కోపంతో కత్తిపోట్లు
- సత్తుపల్లిలో కలకలం 6

పన్ను మిన్ను కానకుండా...



వైరాలోని ఓఇంటి వద్ద పన్ను వసూళ్ల కోసం మోహరించిన మునిసిపల్ సిబ్బంది

- వైరా మునిసిపాలిటీలో సిబ్బంది దాదాగిరి
- ఆస్తి పన్నుల టార్గెట్ల పూర్తి కోసం బృందాలుగా రాక
- రాత్రి, పగలూ తేడా లేకుండా వసూళ్ల పర్వం
- ఇష్టారాజ్యంగా పన్నులు విధించారని జనం ఆరోపణ

వైరా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో నిర్బంధ ఇళ్ల పన్నుల వసూళ్లపై జనం గగ్గోలు పెడుతున్నారు. వైరా మునిసిపాలిటీ ఏర్పడిన తొలినాళ్లలో ఇళ్లపన్నుల డిమాండ్ రూ.1.02 కోట్లుగా ఉంది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మునిసిపాలిటీ యాప్‌లో ఇళ్లపన్నులను భారీగా పెంచుతూ తీసుకువచ్చిన భువన పన్నుల పథకాన్ని అమలుచేయడంతో ఒక్కసారిగా ఈ మునిసిపాలిటీలో పన్నులు రూ.2.38కోట్లకు పెరిగింది. వైరా మునిసిపాలిటీ మొత్తం గ్రామాలతోనే ఉంది. 2018ఆగస్టు రెండున ఈ మునిసిపాలిటీ ఏర్పడింది. పూర్వపు సోమవరం మేజర్ పంచాయతీతోపాటు కొణిజర్ల మండలంలోని లాలాపురం, దిద్దుపూడి, పల్లిపాడు, గుండ్రాతిమడుగు పంచాయతీ పరిధిలోని శాంతినగర్ ఎస్టీకాలనీ కలిపి మునిసిపాలిటీగా ఏర్పాటు చేశారు. ఒక్క వైరా మినహా పైన పేర్కొన్న గ్రామాలతో పాటు గండగలపాడు, బ్రాహ్మణపల్లి అగ్రహారం, సోమవరం పూర్తిగా గ్రామాలతో ఉన్నాయి.

భువన యాప్ అమలులోకి రావడంతో మునిసిపాలిటీలో ఉన్న గ్రామాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలపై భారీగా పన్నుల భారం పడింది. ప్రస్తుతం వైరా మునిసిపాలిటీలో రూ.4.28కోట్ల పన్నులు వసూలు కావల్సి ఉంది. ఇప్పటివరకు 1.82కోట్లు(41శాతం)పన్నులు మాత్రమే వసూలయ్యాయి. ప్రతి సంవత్సరం పన్నుల డిమాండ్ రూ.2.38కోట్లు కాగా, పాత బకాయిలు రూ.1.24 కోట్లు బకాయిలపై పెనాల్టీ రూ.50లక్షలు మొత్తంగా రూ.4.28కోట్లు వసూలు కావాల్సి ఉంది. వాటిలో ఈ ఏడాదికి సంబంధించిన పన్నులు రూ.1.51కోట్లు బకాయిలు వాటిపై ఉన్న పెనాల్టీలకు చెందిన రూ.31లక్షలు మొత్తం రూ.1.82కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.2.46కోట్ల పన్నులు వసూలు కావల్సి ఉన్నాయి.

ఈ తరుణంలో మునిసిపాలిటీ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో మునిసిపల్ కమిషనర్ చింతా వేణు ఆధ్వర్యంలో పదికిపైగా బృందాలు ఈ పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యాయి. ఈ మునిసిపాలిటీలో వార్డు ఆఫీసర్లుగా పూర్వపు వీఆర్వోలు ఉన్నారు. రెవెన్యూశాఖ ప్రక్షాళనలో భాగంగా మళ్లీ వీఆర్వో వ్యవస్థను ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం మునిసిపాలిటీలో వార్డు ఆఫీసర్లుగా ఉన్న వారు తిరిగి మళ్లీ వీఆర్వోలుగా వెళ్లేందుకు ఆప్షన్లు పెట్టుకున్నారు. అయితే మార్చి చివరివరకు మునిసిపాలిటీలో పన్నుల వసూళ్ల కోసం వార్డు ఆఫీసర్లుగా ఉన్నవారిని రిలీవ్ చేయకుండా ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలోనే మునిసిపల్ అధికారుల ఆదేశాలతో తమకు ఇచ్చిన లక్ష్యాల మేరకు పన్నులు వసూలు చేసేందుకు వార్డు ఆఫీసర్లు ఇతర సిబ్బంది వేకువజామునుంచే రాత్రివేళ వరకు బృందాల వారీగా పన్నులు (మిగతా 6వ పేజీలో)

పన్ను మిన్ను కానకుండా...

(5వ పేజీ తరువాయి)

వసూలు చేస్తున్నారు. ఇళ్ల వద్ద ఎవరైనా లేనిప క్షంలో ఇళ్ల తలుపులకు పన్నుల డిమాండ్ నోటీసులు అంటిస్తున్నారు.




రూ.13వేలు పన్ను విధించిన పాతభవనం

ఇళ్ల యజమానులు ఇంటికి చేరుకున్న వెంటనే మునిసిపల్ సిబ్బంది వచ్చి పన్నుల వసూళ్ల కోసం ఇబ్బందిపెడుతున్నారు. సోమవారం ఉదయం ఇదే తంతు జరిగింది. ఏకంగా ఏడెనిమిదిమంది సిబ్బంది అప్పుడే ఇంటికొచ్చిన యజమానిని పన్నులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో వారి తీరుపట్ల నిరసన వ్యక్తం చేశారు. ఎప్పటినుంచో పనికిరాకుండా ఉన్న రెండుగదుల రేకుల షెడ్‌కు రూ.13వేలు పన్ను విధించారని ఇదెక్కడి న్యాయమంటూ ఆ యజమాని నిలదీశారు. ఈ సమస్యపై వందసార్లు మునిసిపల్ కార్యాలయానికి తిరిగినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. చివరకు అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన ఒక సీనియర్ అసిస్టెంట్ తమ ఇంటిపన్ను తగ్గించేందుకు రూ.60వేలు డిమాండ్ చేశారని తాము ఆ సొమ్మును ఇవ్వకపోవడంతో పాత రేకుల షెడ్‌కు కూడా రూ.13వేల పన్ను వేశారని మునిసిపల్ సిబ్బందిని నిలదీశారు. మునిసిపాలిటీ మొత్తం మీద అప్పట్లోని సీనియర్ అసిస్టెంట్ ఇదే తరహాలో రేకుల షెడ్లు, పూరిగుడిసెలకు సైతం భారీగా ఇళ్లపన్నులు వేయడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

వైరా కంటే ఎక్కువగా ఇళ్లు (8719)ఉన్న మధిర మునిసిపాలిటీలో ఇళ్లపన్నులు రూ.1.91కోట్లు ఉండగా, కేవలం 7291ఇళ్లు ఉన్న వైరా మునిసిపాలిటీలో పన్నులు రూ.2.38కోట్లుగా ఉన్నాయి. దాదాపు 1500ఇళ్లు మధిరలో ఎక్కువగా ఉన్నా పన్నులు మాత్రం అక్కడ కంటే రూ.47లక్షలు అదనంగా ఉండటం విశేషం. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని ప్రజలపై విపరీతంగా మోపిన పన్నుల భారాన్ని తగ్గించాలని స్థానికులు కోరుతున్నారు.

చెట్టుకొకరు.. పుట్టకొకరు



- బీఆర్ఎస్ శ్రేణులకు నిలువ నీడలేని దుస్థితి
- రెండు పర్యాయాలు ఎమ్మెల్యేలు ఉన్నా కార్యాలయం కరువు
- ఇల్లెందులో భరోసానిచ్చే నేతలు లేక గులాబీ కేడర్ విలవిల

ఇల్లెందు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ, ఇల్లెందు నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరి ప్రాతినిధ్యం వహించినప్పటికీ పార్టీ శ్రేణులకు నిలువ నీడలేక, భరోసా ఇచ్చే నాయకులు లేక కార్యకర్తలు తల్లడిల్లుతున్నారు. కనీసం కష్టసుఖాలు చెప్పుకోవడానికి మాట్లాడుకోవడానికి పార్టీకి కార్యాలయమే లేకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పార్టీ కార్యక్రమాలకు కార్యకర్తలు, మునిసిపల్ మాజీ కౌన్సిలర్లు హాజరవుతున్నప్పటికీ వారికి పార్టీ గూడు లేకపోవడంతో రోడ్లపైన దుకాణాల వద్ద పోగయ్యే దుస్థితిలో బీఆర్ఎస్ శ్రేణులు కూరుకుపోయాయి.

కారు పార్టీకి కార్యాలయం లేదు..

ఇల్లెందు నియోజకవర్గంలో రెండు పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా కోరం కనకయ్య, బానోత్ హరిప్రియ గెలుపొంది తదనంతరం అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. దశాబ్ద కాలం పాటు ఇరువురు బీఆరెఎస్ ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం కలిగి ఉన్న ఇల్లెందు నియోజకవర్గంలో కనీసం పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. ఇల్లెందు నియోజకవర్గంలో 2014లో కోరం కనకయ్య, 2019లో బానోత్ హరిప్రియ కాంగ్రెస్ అభ్యర్థులుగా గెలుపొంది బీఆర్ఎస్‌లో చేరారు. అయితే ఎమ్మెల్యేలుగా ప్రభుత్వం కేటాయించిన ఎమ్మెల్యేల అధికారిక క్యాంపు కార్యాలయంలోనే అటు పార్టీ, ఇటు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు.

శ్రద్ధ చూపని నాయకులు

బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఇల్లెందులో సైతం ఓటమి చెందటంతో బీఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులకు కార్యాలయం కరువైపోయింది. ఆ పార్టీ అధికారంలో ఉండగా ఇల్లెందుకు చెందిన దిండిగాల రాజేందర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పనిచేశారు. ఇల్లెందు మునిసిపల్ పాలక వర్గంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మెజారిటీ జడ్పీటీసీలు, సొసైటీల అధ్యక్షులు, ఎంపీపీలుగా బీఆర్ఎస్ నాయకులే కొనసాగారు. అయితే అనేక మంది నాయకులు పార్టీ ద్వారా పదవులు అధికారాలు అనుభవించినప్పటికీ నియోజకవర్గ కేంద్రంలో పార్టీకి శాశ్వత కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు శ్రద్ధ చూపక పోవడం గమనార్హం.

నేతలు లేక భరోసా కరువై..

గతంలో బీఆర్ఎస్ ద్వారా అనేక పదవులు అనుభవించిన కొందరు నాయకులు కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. గతఎన్నికల్లో ఓటమి చెందిన మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయితే ఆమె టేకులపల్లి మండల కేంద్రం నుంచి అడపాదడపా రాకపోకలు సాగిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం, హైద్రాబాద్‌లో జరిగే పార్టీ కార్యక్రమాల వరకే పరిమితం అవుతున్నారు. టేకులపల్లి, ఇల్లెందు, బయ్యారం మండలాల్లో క్యాడర్‌కు, దిగువ శ్రేణి నాయకులకు పోలీసులు, అధికార పార్టీ నాయకుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందుల్లో అండగా నిలిచే నాయకులు కరువయ్యారనే బీఆర్ఎస్ శ్రేణులు వాపోతున్నాయి. ప్రజా సమస్యలపై రోడ్డెక్కితే కష్టనష్టాల నుంచి కాపాడే నాయకులు లేరని అంటున్నారు. అధికారం అనుభవించి ఆర్థికంగా బలపడిన నాయకులు నేడు శ్రేణులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

రోడ్లు, దుకాణాల్లోనే పార్టీ శ్రేణుల కలయిక

ఇల్లెందులో నివసించే బీఆర్ఎస్ నేత దిండిగల రాజేందర్‌కు చెందిన పాత ఐస్‌క్రీమ్ షాపునే కార్యకర్తలు అడ్డాగా వాడుకుంటున్నారు. చర్చి వద్దగల గ్రామీణ బ్యాంకు మెట్లను ఆశ్రయిస్తూ మరికొందరు బాధలు పంచుకుంటున్నారు. తుదకు ఇల్లెందుకు ఎవరైనా ముఖ్య నాయకులు వస్తే వారిని కలిసేందుకు, విలేకరుల సమావేశాలు నిర్వహించేందుకు సైతం ఫంక్షన్ హాళ్లను వెతుకుతున్నారు కొసమెరుపు ఏమిటంటే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇల్లెందులో మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న ఓ సినిమా థియేటర్ గేట్ మాజీ మహిళా కౌన్సిలర్లను సన్మానించారు. తుదకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా ముందుకు రానిపరిణామాలు ఇల్లెందు నియోజకవర్గంలో నెలకొన్నాయని ఆ పార్టీ కార్యకర్తలు వాపోతున్నారు.



రోడ్డు పక్కనే బీఆర్ఎస్ నాయకుల మహిళా దినోత్సవం

ఏఐతో విద్యాబోధన విద్యార్థుల పాలిట వరం



ఏఐ విద్యా బోధనను పరిశీలిస్తున్న కలెక్టర్

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

బూర్గంపాడు, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో విద్యాబోధన విద్యార్థులకు వరంగా మారనున్నదని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సోమవారం బూర్గంపాడు మండల పరిధిలోని అంజనాపురం ఎంపీపీఎస్ పాఠశాలలో ఏఐతో విద్యా బోధన తరగతులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన మరింత ఆకర్షణీయంగా నిర్వహించడానికి ఏఐ మెరుగ్గా సహకరిస్తుందన్నారు. దీంతో విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తూ అందుకు తగినట్లు అభ్యాస కృత్యాలు నిర్వహించడం వల్ల విద్యాభ్యాసం పట్ల పిల్లల్లో మరింత ఉత్సాహం పెంచవచ్చని అన్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని అంజనాపురం, మోరంపల్లిబంజర, బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాకలోని గాంధీనగర్ పాఠశాలలో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఏఐ ఆధారిత బోధనలో భాగంగా మండలం నుంచి ఒక ఉపాధ్యాయుడిని హైదారాబాదుకు ఏఐ బోధనలో శిక్షణకు పంపిస్తామని తెలిపారు. ఏఐ ఆధారిత విద్య భోదనలో ఉపాధ్యాయుల తీరును సంబంధిత ఎంఈవోలు పర్యవేక్షిస్తూ కార్యక్రమాన్ని రోజువారీగా సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం బూర్గంపాడులోని ఆశ్రమ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటశాల, పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు పుస్తక పఠనంలో ఉన్న నైపుణ్యాన్ని హిందీ పాఠ్యపుస్తకాన్ని చదివించి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ బోధన, మెనూపై ఆరా తీశారు. పర్యటనలో భాగంగా మోరంపల్లిబంజర్‌లో కమ్యూనిటి హెల్త్ సెంటర్ నిర్మాణానికి కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. వేపలగడ్డ బస్టాండ్ సమీపంలో సూచించిన నాలుగు ఎకరాల భూమిని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ నరేష్, ఎంఈవో యదుసింహరాజు, పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



మహిళా అధికారులతో ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో మహిళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, మగవారికి దీటుగా ప్రతీ రంగంలో మహిళలు ముందంజలో ఉన్నారని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీవో రాహుల్ మాట్లాడారు. మహిళలు జీవితం బాల్యం నుంచే ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ తన జీవితాన్ని కొనసాగిస్తారని అన్నారు. ఆడపిల్ల పుడుతుందని తల్లిదండ్రులు కూడా పట్టించుకోకపోవడం, మగపిల్లలకు ఇచ్చే విలువ ఆడ పిల్లలకి ఇవ్వకపోవడం ఒకప్పుడు ఉండేదని అన్నారు. ఇప్పుడు ప్రతి ఇల్లాలు తప్పనిసరిగా ఆడపిల్ల పుట్టాలని కోరుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వాలు మహిళా సాధికారత దిశగా అనేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాయని అన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా బిలాయిలో ఐఐటీ రెండో సంవత్సరం చదువుతున్న సోయం వాసవి అనే విద్యార్థినికి రూ.50 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు, డీడీ మణెమ్మ, ఆర్సీవో గురుకులం నాగార్జునరావు, జీసీడీవో అలివేలు మంగతాయారు, ఏటీడీవో రాధమ్మ, డాక్టర్ ప్రవళిక, సాత్విక, ఎస్డీవో సుభద్ర మాధవి, సంధ్యా, ప్రమీల బాయి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అందమైన పుణె అబ్బురపరిచింది...

(5వ పేజీ తరువాయి)

సేంద్రియ ఎరువులు, బయోగ్యాస్, ఇతర ముడి పదార్థాలకు వాడుతున్నారని అటువంటి అంశాలను ఖమ్మంలో కూడా అమలు చేస్తామన్నారు. పుణెలో ముత్తమాల నది పరిరక్షణ జరిగిన విధంగానే మున్నేరులో కూడా కార్యాచరణ చేస్తామన్నారు.

ప్రతి 500 మీటర్లకు ఒక ఘాట్‌ను ఏర్పాటు చేస్తున్నారని, నది పరిరక్షణ ద్వారా రూ.5,200 కోట్లు ఆదాయం పెరిగిందన్నారు. అండర్ గ్రౌండ్ మెనేజ్‌మెంట్ సిస్టమ్ మూలంగా అక్కడ రహదారులు, వీధుల వెంట డ్రెయినేజీలు కనిపించలేదన్నారు. ఖమ్మం నగరం అవసరాల మేరకు పూణె స్ఫూర్తితో నిర్మాణాలు చేస్తామన్నారు.

ప్రతీ 200 ఇళ్లకు ఒక స్వచ్ఛ సంఘం సభ్యుడు చెత్త సేకరణ చేస్తున్నారని, ప్రతీ ఇంటి నుంచి రూ.65 నుంచి రూ.85 వసూలు చేస్తున్నారని తెలిపారు. పుణె నగరంలోని కార్పొరేట్ సంస్థలు, ప్రైవేట్ వ్యాపారులు సీఎస్ఆర్ ఫండ్స్ అందివ్వటం ద్వారా పుణె మునిసిపాలిటీ ఆధ్వర్యంలో వైద్యశాలలు, ఇంజనీరింగ్ కాలేజీలు నిర్వహణ జరుగుతుందన్నారు. కూడళ్ల అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఖమ్మంలోని కమర్షియల్ వ్యాపారులు సీఎస్ఆర్ ఫండ్స్ ఇవ్వాలని కోరారు. ప్రతి ఫంక్షన్ హాల్‌లో వారి వ్యర్థాలను వారే శుద్ధి చేసేందుకు ఫంక్షన్ హాల్స్ భవనాలపై బయోగ్యాస్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి కూరగాయలు, మిగిలిన ఆహారం, ఇతర వ్యర్థాలతో బయో గ్యాస్, సేంద్రియ ఎరువులను ఉత్పత్తి చేస్తున్నారని వివరించారు. ఇలా చేసిన ఫంక్షన్ హాల్స్‌కు మాత్రమే అనుమతి ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఖమ్మం ప్రజలు నగర పాలక సంస్థ పారిశుధ్య ఉద్యోగులకు సహకారం అందిస్తే పుణె నగరానికి మించిన స్థాయిలో ఖమ్మం ఎదుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, కార్పొరేటర్లు కొత్తపల్లి నీరజ, మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, క్లైమెట్, రాపర్తి శరత్‌కుమార్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరింగ్ అధికారి కృష్ణలాల్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు హెల్ప్‌డెస్క్

(5వ పేజీ తరువాయి)

జరుగుతోందన్నారు. 2020కి ముందు 10 శాతం రిజిస్ట్రేషన్ జరిగి మిగిలిన ప్లాట్ల అమ్మకాలు చేసుకునేవారు రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, ఫీజులు చెల్లించాలన్నారు.

2020 ఆగస్టు 26కంటే ముందు 10 శాతం విక్రయించిన ప్లాట్లు అనధికార లేఅవుట్లను రెగ్యులరేజ్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, పర్యావరణ అనుబంధ జోన్లలో ఉన్న స్థిరాస్తులను రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవద్దని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఫీజు, రిజిస్ట్రేషన్ ఫీజు వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. మార్చి 31 నాటికి చెల్లింపులు చేసేవారికి రెగ్యులరైజేషన్ చార్జీలపై రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిందన్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లింపుల అనంతరం అభ్యర్థులు ఐజీఆర్ఎస్ పోర్టల్‌కు వెళ్లి ఆస్తి రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు, దరఖాస్తు లోపాల పరిష్కారానికి ప్రత్యేక సహాయ డెస్క్‌లను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ ఎల్ఆర్ఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఆస్తి యాజామాన్య సాక్షి పత్రాలు, సర్వేనెంబర్లు, ఈసీ ప్రతులు, లేఅవుట్ ప్రణాళికల గురించి వివరించారు. ఈ సెమినార్‌లో సబ్ రిజిస్ట్రార్ టి.సంపత్‌కుమార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఎస్.రమాకిషోర్‌రెడ్డి, పలువురు అధికారులతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులు, స్థలాల యజమానులు, డాక్యుమెంట్ రైటర్లు, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ సభ్యులు, వివిధ వెంచర్ల యజమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణలో ప్రభుత్వం ఇచ్చిన రాయితీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో శిక్షణా కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, రిజిస్ట్రేషన్ శాఖ, పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. మార్చి 31తో రాయితీ గడువు పూర్తి కానందున డిమాండ్ మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఖమ్మంనగరంలో దరఖాస్తుదారుల సౌకర్యం కోసం పది ప్రాంతాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. వెబ్‌సైట్ అప్‌డేట్ కారణంగా సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయని కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ రూపంలో సమాచారం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఖమ్మం నగరంలో మొత్తం 1,155మంది ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజులు చెల్లించారని, ఇంకా 18,182 మంది పెండింగ్‌లో ఉందన్నారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

- అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే అర్జీదారుల సమస్యలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి అధికారులు వాటి పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, పరిశీలించి పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో. అరుణ, జిల్లా అధికారులు బీసీ సంక్షేమ అధికారి జ్యోతి, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, డీఎస్వో చందన్‌కుమార్, డీఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా

- సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన బేతిని అప్పారావు చీపురికుంట చెరువు సర్వే నెంబర్ 280 లో 6 ఎకరాల 1 గుంటకు నిధులు కేటాయించి పునరుద్ధరించాలని కోరారు., ఆక్రమణల తొలగించి రక్షణ కల్పించాలంటూ కలెక్టర్‌ను కోరింది.
- రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రావు తన సంతకం ఫోర్జరీ చేసి సర్వే నెంబర్ 284 లో 38 గుంటల తప్పుడు డాక్యుమెంట్ తయారు చేసి పాస్ బుక్ పొందారని విచారణ చేసి తనకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌ను వేడుకున్నాడు.
- సింగరేణి మండలానికి చెందిన సయ్యద్ చాంద్‌పాషా సర్వే నెంబర్ 161లో పట్టా భూమిలో 1981 సంవత్సరంలో ఇల్లు కట్టుకొని ఉంటున్నానని, ఈ ఇంటి స్థలం నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు.

కానిస్టేబుల్‌పై దొంగ దాడి



కానిస్టేబుల్‌కు కుట్లు వేస్తున్న దృశ్యం

సత్తుపల్లి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తి... పదునైన చాక్‌తో కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. కలకలం రేపిన ఈ సంఘటన సత్తుపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా చాట్రాయికి చెందిన సురేందర్ అనే వ్యక్తి గతంలో పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవల కాలంలో సత్తుపల్లి మండలంలో కూడా కొన్ని చోరీ సంఘటనలు జరగడంతో సురేందర్ కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో సోమవారం సత్తుపల్లిలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న సురేందర్‌ను ఐడీ కానిస్టేబుల్ నరేష్ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి అనుసరిస్తూ వెళ్లాడు. వేంసూరు రోడ్‌లోని మెట్టాంజనేయ స్వామి గుడి సమీపంలోకి వెళ్లగానే.. సురేందర్ పదునైన చాక్‌తో కానిస్టేబుల్‌పై ఒక్కసారిగా దాడిచేసి తీవ్రంగా గాయపడిచాడు. ఈ సంఘటనలో నరేష్ తలముందు, వెనుక భాగంలో, చెవి, వీపు, పొట్ట తదితర భాగాల్లో తొమ్మిది చోట్ల గాయాలయ్యాయి. గాయపడిన నరేష్‌ను స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తున్న డాక్టర్ మట్టా సాత్విక్ మాట్లాడుతూ నరేష్‌కు ప్రాణాపాయం లేదని ఒక గాయం వద్ద రక్తస్రావం అధికంగా ఉందని చెప్పారు. దాడిచేసిన సురేందర్‌ను స్థానికులు పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది. కాగా ఈ ఘటనలో సత్తుపల్లి జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆయేషా షరీన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ నుంచి వాగ్మూలం నమోదుచేశారు.

హామీల అమలు పట్టని సర్కారు

ఖమ్మం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటై యేడాదిన్నర కాలం పూర్తికావొస్తున్నప్పటికీ ఏ హామీ అమలుకాలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకోసం, ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి సోమవారం నుంచి ఈ నెల 20వతేదీ వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టామన్నారు. అనంతరం 20 నుంచి 30వ తేదీ వరకు మండల, మునిసిపల్ కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అందిస్తామన్న గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలు, రేషన్ కార్డులు లేకపోవడం వల్ల చాలా కుటుంబాలకు అందడంలేదన్నారు. రుణమాఫీ నాలుగు దఫాలుగా చేసినప్పటికీ ఇంకా పూర్తికాలేదన్నారు. రైతు భరోసా పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు యేడాదికి రూ. 12వేల ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయడానికి ఉపాధిహామీ పనులకు లింకు పెట్టడం వల్ల చాలామంది నష్టపోనున్నారన్నారు.

18యేళ్లు నిండిన మహిళలకు రూ. 2500 పథకం కూడా ఇంకా ప్రారంభం కాలేదన్నారు. కౌలు రైతులకూ భరోసా ఇస్తామని చెప్పారే తప్ప అమలుకు పూనుకోలేదన్నారు. సన్న రకాల బోనస్ ఇంకా పెండింగ్‌లో చాలా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తామని చెబుతున్నారే తప్ప ఎక్కడా ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదన్నారు. ఆరుగ్యారంటీల అమలు కోసం రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రఘునాథపాలెం మండలం శివాయిగూడెం కాలనీలో పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. 2012లో 3వేల మందికి అక్కడ పట్టాలు రద్దు చేయాలని చూడగా ఆందోళనలు చేశామన్నారు. ఇల్లు కట్టని వారి పట్టాలు రద్దు చేస్తామనీ అధికారులు చెబుతున్నారనీ, ఇంకా 900 మంది ఇల్లు కట్టుకోలేదనీ, వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

వారబందీని రద్దుచేయాలి

నీటి సరఫరా లేక సాగర్ ఆయకట్టు ఎండిపోతుందనీ, వెంటనే వారబంది పద్ధతిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గోదావరి జలాలు ఎన్నెస్పీ రావడంతో వైరా నుంచి సత్తుపల్లి ప్రాంతానికి ఇబ్బంది లేదనీ, కానీ బీబీసీ కెనాల్ కింద ఉన్న పంటలు ఎండిపోతున్నాయన్నారు. వెంటనే వారబంది పద్ధతిని రద్దు చేసి నిరంతరం నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా ఉందని, వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై. విక్రమ్, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రబీ పంటలకు నీటి ఎద్దడి రావొద్దు...

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల



పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలను కాపాడేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రులు రబీ సాగునీటి సరఫరాపై రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో కలిసి క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలు ఎండి పోతున్నట్లు చూపుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్లు, వ్యవసాయ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్లు నివేదికలు తీసుకుని విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పంట నష్టం జరగకుండా, ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 55 లక్షల ఎకరాలలో వరి పంట సాగు అవుతుందన్నారు.రాజకీయ దురుద్దేశాలతో ప్రస్తుత ఉన్న పరిస్థితిని ఎక్కువ చేసి చూపించి, రబీ యాక్షన్ ప్లాన్ లో లేని ప్రాంతాలలో పంటలు ఎండి పోతున్నట్లు వార్తలు వస్తున్నాయని వీటిపై కలెక్టర్లు స్పందించి ప్రజలకు వాస్తవాలు తెలిసేలా వివరించాలని మంత్రి సూచించారు.

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 18 లక్షల ఎకరాలు వివిధ ప్రాజెక్టు కాల్వల కింద, 37 లక్షలు బోర్ల కింద వరి పంట సాగు అవుతుందన్నారు. దేవాదుల ప్రాజెక్టు వద్ద జనగాం, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో కొంత మేర ఇబ్బందులు ఉన్నాయన్నారు. రాబోయే 10 నుంచి 15 రోజులలో నీటి పారుదలశాఖ అధికారులతో అవసరమైన నీటి విడుదల చేస్తూ పంటలను కాపాడే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలన్నారు. ఆయకట్టు కింద కాలువల ద్వారా విడుదల చేసే నీటిలో ముందు టెయిల్ ఎండ్ ప్రాంతాలకు నీరు వచ్చేలా చూడాలని అన్నారు. నాగార్జున సాగర్ కింద ఒక ఎకరం కూడా ఎండి పోవడానికి వీల్లేదని మంత్రి సూచించారు. పోలీసుల సహకారం తీసుకొని చివరి ఆయ కట్టుకు నీళ్ల చేరేలా చూడాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ సరఫరా సమస్యలు లేవన్నారు. జిల్లాలో రైతులకు సాగునీరు అందించేందుకు తీసుకుంటున్న చర్యలు, సాగు అవుతున్న పంట వివరాలు, నీటి సరఫరా చేసి కాపాడిన పంట వివరాలు కూడా పత్రికల్లో ప్రచురించేలా చూడాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు.

- వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో నీటి సరఫరా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా నీటి కోసం ఆందోళనలు చేయడం, పైప్ లైన్ ప్రాంతాలలో షెటర్లు ఓపెన్ చేయడం వంటి పరిస్థితి ఉంటే వెంటనే పోలీసు శాఖను అప్రమత్తం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ వాసంతి, వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నేలకొండపల్లిలో మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి, మార్చి10(ఆంధ్రజ్యోతి): పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం నేలకొండపల్లిలో మండలంలో పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో పాటుగా పలు పరామర్శలు, ఆశీర్వాదాల కార్యక్రమాల్లో పాల్గొంటారు. తొలుత అనాసాగరంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం పలు కార్యక్రమాలలో పాల్గొనను న్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి ప్రకటనలో కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు, జూలూరుపాడు, సుజాతనగర్, దమ్మపేట, టేకులపల్లి, కూసుమంచి, కారేపల్లి మండల కేంద్రాలలో కంప్యూటర్, ప్రింటర్, వేయింగ్ మిషన్ కలిగి ఉన్న నిరుద్యోగ యువతకు లాజిస్టిక్ (కార్గో) కేంద్రాలను నడుపుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం రీజియన్ ఏటీఎం వి. రామారావు తెలిపారు. మరిన్ని వివరాలకు 9154298582 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

బియ్యం నిండుకున్నాయ్..!

» తెల్లకార్డుదారులకు రేషన్ బియ్యం కొరత

» ఈనెల పదిరోజులైనా రేషన్‌షాపులకు సరఫరా కాని బియ్యం



వైరా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న పౌరసరఫరాలశాఖకు చెందిన మండలస్థాయి స్టాక్ పాయింట్(ఎంఎల్ఎస్)గోదాము రేషన్ బియ్యం లేక వెలవెలబోతుంది. మార్చినెల వచ్చి పదిరోజులు దాటుతున్నా ఈ ఎంఎల్ఎస్ పాయింటు పరిధిలోని 30శాతం రేషన్‌షాపులకు కూడా రేషన్‌బియ్యం సరఫరా జరుగలేదు. తెల్లకార్డుదారులకు రేషన్ బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. పౌరసరఫరాలశాఖ అధికారులు, సిబ్బంది రేషన్‌బియ్యం సరఫరాపై కనీస సమాచారం ఇవ్వలేని స్థితిలో ఉన్నారు. ఖమ్మంజిల్లాలో ఖమ్మం అర్బన్, రూరల్, నేలకొండపల్లి, మధిర, ఏన్కూరు, కల్లూరు, సత్తుపల్లి, వైరాల్లో ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. ఈ ఎంఎల్ఎస్ పాయింట్ల గోదాముల్లో కూడా ఈనెలలో బియ్యం నిల్వలు నిండుకున్నాయి. వైరా ఎంఎల్ఎస్ పాయింటు పరిధిలో వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాలు ఉన్నాయి.

30షాపులకే రేషన్ బియ్యం సరఫరా...

ఈ మూడుమండలాల పరిధిలో 96రేషన్‌షాపులుండగా సోమవారం వరకు కేవలం 30షాపులకు మాత్రమే రేషన్ బియ్యాన్ని సరఫరా చేశారు. కొణిజర్ల మండలంలో అత్యధికంగా 41రేషన్‌షాపులకుగానూ 2,873క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 1,223క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని 16రేషన్‌షాపులకు సరఫరా చేశారు. ఇంకా 25షాపులకు 1,650క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. వైరా మండలంలో 29రేషన్‌షాపులకుగానూ 2,301క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం ఐదు షాపులకు మాత్రమే 518క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సరఫరా చేశారు. ఇంకా 24రేషన్‌షాపులకు 1,783క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. తల్లాడ మండలంలో 26రేషన్‌షాపులుండగా కేవలం 9రేషన్‌షాపులకు మాత్రమే 830క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సరఫరా చేశారు. ఇంకా 17రేషన్‌షాపులకు 1,588క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది.

బియ్యం సరఫరా జరిగిన రేషన్‌షాపుల వివరాలు..

కొణిజర్ల మండలంలో కొణిజర్ల-1,2,3,4 షాపులు, పెద్ద మునగాల, చిన్నమునగాల, కాచారం, కొండవనమాల, అనంతారం, అమ్మపాలెం, రాజ్యాతండా, గుండ్రాతిమడుగు, లింగగూడెం, గోపవరం, పల్లిపాడు, దిద్దుపూడి, వైరా మండలంలో వైరా 1,2,3,4, బ్రాహ్మణపల్లి అగ్రహారం షాపులకు, తల్లాడ మండలంలో తల్లాడ 1,2, పినపాక 1,2, మల్లవరం 1,2, అన్నారుగూడెం 1, కొడవటిమెట్ట, క్రిష్టాపురం రేషన్‌షాపులకు మాత్రమే బియ్యం సరఫరా చేశారు. ఇంకా ఈ మూడు మండలాల్లోని 66షాపులకు బియ్యం సరఫరా కాలేదు. వైరాలోని ఎంఎల్ఎస్‌పాయింట్ గోదాము బియ్యం లేక ఖాళీగా ఉంది. స్టేజీ-1 పాయింటు నుంచి స్టేజీ-2 పాయింట్ అయిన ఎంఎల్ఎస్ పాయింటు గోదాములకు రేషన్‌బియ్యం దిగుమతి అయి మళ్లీ ఇక్కడి నుంచి రేషన్‌షాపులకు సరఫరా చేయాల్సి ఉంది. ఏ స్టేజీ-1పాయింటు నుంచి స్టేజీ-2 పాయింటుకు రేషన్‌బియ్యం వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. రాష్ట్రంలో ఎక్కడ బియ్యం నిల్వలున్నాయోనని పౌరసరఫరాలశాఖ అధికారులు ఆరా తీస్తూ అక్కడి నుంచి జిల్లాకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. అయితే ఆ ప్రయత్నాలు ఎంతమేరకు ఫలించి ఎప్పటివరకు రేషన్‌షాపులకు బియ్యం చేరి వాటిని తెల్లకార్డుదారులకు పంపిణీ చేస్తారో తెలియని అయోమయ, గందరగోళ పరిస్థితి నెలకొంది.

రైతుల కష్టం

కోతుల పాలు

» పంటలను ధ్వంసం చేస్తున్న కోతులు



మొక్కజొన్న పంటకు కాపలా కాస్తున్న రైతు

ముదిగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అడవులు, శివారులకు పరిమితమైన వానరాలు(కోతులు) ప్రస్తుతం గ్రామాల్లోకి ప్రవేశించి విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలు, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి దాడులు చేస్తూ ఏది పడితే పట్టుకొని పరుగులు తీస్తున్నాయి. ఇదిలా ఉంటే వరుసగా నష్టాలతో అష్టకష్టాలు పడుతూ వాతావరణం అనుకూలించక పంటలు పండక నానా ఇబ్బందులు పడుతున్న రైతులను కూడా కోతులు వదలడం లేదు. పంటలను కోతులు ధ్వంసం చేస్తూ రైతులను తీవ్ర నష్టపరుస్తున్నాయి. ఒక పక్క దిగుబడులు రాక మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో, మరో పక్క కోతుల బెడదతో అన్నదాతలు అల్లాడిపోతున్నారు. విత్తనం నాటి నుంచి పంట చేతికొచ్చేవరకు కోతుల భారీ నుంచి కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కొంతమంది రైతులు పొలాల చుట్టూ చీరలు ఏర్పాటు చేస్తుండగా, మరికొంతమంది వలలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అసలే వ్యవసాయంలో పత్తి, వరి పంటలు దిగుబడి రాకపోవడంతో కొంతమంది మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నారు. మొక్కజొన్న కంకీ వేసే సమయానికి కోతుల గుంపు పంటపై పడి దాడి చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఒక్కరోజు ఏమరపాటుగా ఉన్నా మొక్కజొన్న చేలో పడి నష్టం చేకూర్చుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతులను తరిమేందుకు నెలకు రూ.20వేల వరకు వెచ్చించి కూలీలను పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలుపుతున్నారు. అలాగే రాత్రుల సమయాల్లోనూ రైతులే పంటకు కాపలా ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పండ్ల తోటలను కాపాడుకునేందుకు రైతులు రూ.వేలకు వేలు వెచ్చించి సోలార్ విద్యుత్‌తోపాటు కొండ ముచ్చులను ఏర్పాటు చేసుకొని పంటను కాపాడుకుంటున్నారు. దీనికి అధిక వ్యయం వెచ్చించాల్సి వస్తుందని కోతుల కోసం ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేసి కోతుల బెడద నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



గ్రామంలో సంచరిస్తున్న కోతులు

పంటను కాపాడుకోవడం కష్టంగా మారింది



● కందుల భాస్కర్‌రావు, రైతు, వెంకటాపురం

11ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. కోతుల భారీ నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకోవడం కష్టతరంగా మారింది. పంటను కాపాడుకొనేందుకు ఓవ్యక్తిని కాపలాగా పెట్టుకొని నెలకు రూ.20వేలు జీతం ఇస్తున్నాను. కోతుల విపరీతంగా సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

భూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



హాజరైన రెవెన్యూ అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భూచట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి, విధులను నిజాయితీగా నిర్వర్తిస్తూ పారదర్శకంగా సేవలందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం టీటీడీసీలో రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్లకు సర్వీస్ అంశాలపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు చేయాల్సిన విధులు, బాధ్యతలను పక్కాగా నిర్వహించేందుకు శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు, విశ్రాంత ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సురేష్ పొద్దర్, కలెక్టరేట్ పర్యవేశకులు టి. కరుణాకర్ రెడి తదితరులున్నారు.

పుచ్చసాగులో ఎకరానికి 20టన్నుల దిగుబడి

» రైతు లక్ష్మీరెడ్డిని అభినందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బూర్గంపాడు, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతు యారం లక్ష్మీరెడ్డిని సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్ ద్వారా అభినందించారు. రైతు లక్ష్మీరెడ్డి తన పొలంలో పుచ్చకాయలను సాగు చేశారు. పుచ్చకాయల దిగుబడికి అవసరమైన చర్యలు చేపట్టి ఎకరానికి సుమారు 20టన్నుల దిగుబడిని రాబట్టారు. దీంతో విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల రైతుకు ఫోన్ చేసి అభినందించారు. పంటను కోతుల బెడద, పశువుల నుంచి రక్షించుకునేందుకు పొలం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నట్లు రైతు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయం రంగంలో రైతు లక్ష్మీరెడ్డిని ఆదర్శంగా తీసుకుని మిగతా రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు.



సాగు చేసిన పుచ్చకాయతో రైతు లక్ష్మీరెడ్డి

పరీక్షా కేంద్రాల్లో గోడ గడియారం ఏర్పాటు

» పరీక్షా సమయం చూసుకునే వెసులుబాటు..



పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న గడియారాలు

కొత్తగూడెం అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలు రాసే సమయం చూసుకునేందుకు చేతి గడియారాలను తమ వెంట తీసుకోని రావడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది నుంచి విద్యార్థులు చేతి గడియారాలను, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను కూడా ఇంటర్ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు. ఒక్కో పరీక్షా కేంద్రంలో 20కి పైగా గదులు ఉండటంతో గంట మోగించినా అందరికీ వినిపించడం లేదు. టైం తెలియక విలువైన సమయాన్ని నష్టపోతున్నామని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఇంటర్మీడియట్ బోర్డు స్పందించింది. పరీక్షా కేంద్రాల్లోని ప్రతి తరగతి గదిలో తప్పనిసరిగా గోడ గడియారం(వాల్ క్లాక్) ఏర్పాటు చేయాలని శనివారం ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. జిల్లాలో మొత్తం 36 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. సోమవారం నుంచి అన్ని కేంద్రాల్లో విద్యార్థులకు గోడ గడియారాలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లాలో సుమారు 500కి పైగా కొనుగోలు చేసి ఏర్పాటుచేసినట్లు డీఐఈఓ హెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం 9,255మంది, ద్వితీయ సంవత్సరం 10,003మంది పరీక్షలకు హజరవుతున్నారు.. పరీక్ష గదిలో వాల్‌క్లాక్స్ ఏర్పాటుతో పరీక్షలు రాసే విద్యార్థులకు ఊరట లభించినట్లయ్యింది.

ప్రజావాణికి అధికారుల డుమ్మా

కారేపల్లి, మార్చి10(ఆంధజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యాక్రమానికి పలు శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరు అవుతున్నారు. సమస్యలు పరిష్కారం అవుతాయని దూర ప్రాంతాల నుంచి పలువురు స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. కాగా పలు శాఖల అధికారులు రాకపోవడంతో ఉసురుమంటూ తిరిగివెళ్లిపోయారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రజావాణిలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

జూలూరుపాడు, మార్చి10(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో మనోవేదనకు గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం మండలంలోని కరివారిగూడెం పంచాయతీ పరిధిలోని తవిసిగుట్టతండా గ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరరావు(34) ఈఘటనకు పాల్పడ్డాడు. కొన్ని రోజులుగా నాగేశ్వరరావు, భార్య మౌనికల మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. 10గంటలైన నాగేశ్వరరావు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి సోదరుడు ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు యువకుడు అదృశ్యం అయినట్లు కేసు నమోదు చేశారు. కాగా కొద్దిసేపటి తర్వాత నాగేశ్వరరావు అతడి చెల్లి బొడా మౌనికకు ఫోన్ చేశాడు. పురుగుమందు తాగనని, చనిపోతున్నాని, నా గురించి వెతకవద్దని చెప్పాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు నాగేశ్వరరావు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా చింతలతండా గ్రామశివారులో గల భీముడుగండం గుట్టపైన ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు, నాగేశ్వరరావు కుటుంబసభ్యులు గుట్టపైకి ఎక్కి చూడగా అప్పటికే చనిపోయాడు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే తన అన్న నాగేశ్వరరావు మృతిచెందాడని సోదరుడు ప్రసాద్ ఫిర్యాదు చేయగా ఎస్సై బాదావత్ రవి కేసు నమోదు చేశారు.



నాగేశ్వరరావు(ఫైల్)

మిరప కల్లానికి నిప్పు

» భద్రాద్రి జిల్లా వెంకట్రావుపేటలో గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్య

» 70 క్వింటాళ్ల మిర్చి దగ్ధం..

» బాధిత రైతులకు రూ.10లక్షలపైనే నష్టం

పినపాక, మార్చి 10(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం వెంకట్రావుపేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ రైతుకు చెందిన ఎండు మిర్చికి నిప్పు పెట్టారు. ఈ ఘటనలో కల్లంలోని 70క్వింటాళ్ల మిర్చి కాలిపోయింది. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పొనగంటి పురుషోత్తం అనే రైతు 6 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. ప్రస్తుతం మిర్చి కోతల సమయంలో కావడంతో కూలీలతో కోయించిన మిర్చిని కల్లంలో ఆరబెట్టి గ్రేడింగ్ చేసి 70క్వింటాళ్ల మిర్చిని కుప్పగా పోశాడు. ఆ పంటను త్వరలో మార్కెట్‌కు తీసుకువెళ్లి అమ్ముకుందామనుకుంటున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి కల్లంలో నిల్వచేసిన మిర్చికి నిప్పు పెట్టారు. కల్లంలో మంటలు ఎగిసి పడుతుండడంతో గమనించిన గ్రామస్థులు రైతు పురుషోత్తంకు సమాచారం అందించడంతో అతడు స్థానికులతో కలిసి కల్లం వద్దకు చేకున్నాడు. అయితే కల్లానికి సమీపంలో నీరు అందుబాటులో లేకపోవడంతో పాటు మంటల కారణంగా తీవ్రమైన మిర్చి ఘాటు రావడంతో మంటలను అదుపు చేయలేకపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత రైతు పొనగంటి పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఏడూళ్ల బయ్యారం సీఐవెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజ్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ప్రాథమిక ఆధారాలతో నష్టం అంచనా వేశారు.నివేదికను తహసీల్దార్‌కు అందిస్తామన్నారు. ఈఘటనలో సుమారు రూ.10లక్ష నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

పోలీసు జాగిలంతో విచారణ..

మిర్చిదహనం ఘటనలో ఏడూళ్ల బయ్యారం పోలీసులు నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందుకోసం పోలీసు జాగిలాన్ని రంగంలోకి దింపారు. ఇప్పటికే వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కొందరు అనుమానితుల ఇళ్లను జాగిలం పసిగట్టినట్లు స్థానికులు చెబుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి..

పొన్నగంటి పురుషోత్తం, బాధిత రైతు

ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఆరు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. సుమారు రూ.18లక్షలు పెట్టుబడికి ఖర్చు చేశారు. చేతికొచ్చిన పంటను బుగ్గిపాలు చేసి తన కుటుంబాన్ని అధోగతి పాలు చేశారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలి.



గంజాయి పట్టివేత

ఖమ్మంక్రైం,మార్చి10(ఆంధ్రజ్యోతి): నలుగురు యువకుల వద్దనుంచి 300 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.నగరంలోని పంపింగ్‌వెల్ రోడ్‌లో ఉన్న వనజీవి రామయ్య పార్క్ వద్ద సోమవారం నగరానికి చెందిన నలుగురు యువకులు అనుమానంగా తిరుగుతుండటంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీచేశారు. గంజాయి, మూడు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని వారిపై కేసునమోదు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నేలకొండపల్లి, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఆదివారం కారు ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన కొమ్మినేని జగ్గయ్య(86)ఆదివారం పని మీద తన మోపెడ్ వాహనంపై నేలకొండపల్లి వచ్చాడు. తిరిగి ఆరెగూడెం వెళుతుండగా కూసుమంచి రోడ్డులో హైవే అండర్‌పాస్ దాటుతుండగా వేగంగా వచ్చిన కారు జగ్గయ్య మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ జగ్గయ్యను ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జగ్గయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా మృతుడు స్వాతంత్ర్య సమరయోధుడు.. కాంగ్రెస్ నాయకుడు కూడా అయిన జగ్గయ్య మృతికి పలువురు నివాళులర్పించారు.



జగ్గయ్య(ఫైల్)

ఆటో బోల్తా: 14మందికి గాయాలు

» ఉపాధి హామీ పనులకు వెళుతుండగా ఘటన

సత్తుపల్లిరూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనికి వెళుతున్న కూలీల ఆటో బోల్తా పడటంతో 14మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సత్తుపల్లి పట్టణంలోని దామెర చెరువు వద్ద చోటుచేసుకుంది. క్షతగాత్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకర్లపల్లికి చెందిన 14మంది కూలీలు స్థానిక గుడిపాడు సమీపంలోని దామెర చెరువు వద్దకు ఆటోలో వెళ్తున్నారు. చెరువు అలుగు వద్ద ప్రమాదవశాత్తూ ఆటో పల్టీ కొట్టడంతో ఆటోడ్రైవర్ సాధు వీరయ్యతో పాటు 14మంది గాయాలయ్యాయి. వీరిని 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కే.పుల్లమ్మ కాలువిరగ్గా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కే.సత్యం, ఎం.క్రాంతి, ఎస్.కృష్ణవేణి, కే.ముత్తమ్మ, కే.లక్ష్మీకాంతమ్మ, కే.సూరమ్మ, కే.నాగమ్మ, ఎస్.కుమారి, హెచ్.వరలక్ష్మీ, నాగలక్ష్మీ, భూషమ్మ, నాగేందర్‌రావు, కే.రజినిలు ఉన్నారు. అయితే రోజూ అలుగు వద్దకు రాగానే కూలీలంతా ఆటో దిగి కొంతదూరం నడిచిన తర్వాత వాహనంలో ఎక్కి వెళ్లేవారు, కానీ సోమవారం మాత్రం ఆటోలో కూలీలు ఉండగానే డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు. ఏదైనా పెనుప్రమాదం జరిగితే తమ గతేమిటంటూ ఆసుపత్రి వద్ద కూలీలు విలపించారు. కాగా క్షతగాత్రులను కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను వైద్యులు కే.వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు.





ఆసుపత్రిలో కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు దయానంద్

భార్య, వదినపై కత్తితో దాడి

అశ్వారావుపేటరూరల్,మార్చి10(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్య, అడ్డుగా వచ్చిన వదినపై కత్తితో దాడిచేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ఆంధ్రాలోని గుంటూరు ప్రాంతానికి చెందిన దమ్ము ఉమా మహేశ్వరి, శ్రీనివాసరావు దంపతులు ఏడాది క్రితం వలస వచ్చి మండలంలోని నారంవారిగూడెం కాలనీలో నివాసం ఉంటున్నారు. కూలి పనులు చేసుకుని జీవించే శ్రీనివాసరావు మద్యం తాగి భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి కూడా అతిగా మద్యం తాగి గొడవపడ్డాడు. భయపడిన ఉమామహేశ్వరి సమీపంలో ఉన్న అక్క వెంకటలక్ష్మీ ఇంటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు అక్కడకు వెళ్లి భార్యతో గొడవపడ్డాడు. ఇదే సమయంలో కత్తితో దాడిచేయగా ఉమా మహేశ్వరి చేతికి గాయమైంది. అదే సమయంలో అడ్డుగా వెళ్లిన వెంకటలక్ష్మీపై కూడా దాడికి పాల్పడ్డాడు. గాయపడిన ఇద్దరినీ అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశారు.

అడవి పంది దాడిలో గాయాలు

మణుగూరు, మార్చి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అటవీ గ్రామమైన బుగ్గలో సోమవారం తెల్లారుజామున ఓ గిరిజనుడిపై ఓ అడవి పంది దాడి చేసింది.బుగ్గగ్రామానికి చెందిన కొమరం సూరిబాబు సోమవారం తునికి పండ్ల సేకరణ కోసం గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి వెళ్లాడు. తునికి పండ్లు ఏరుతుండగా అడవి పంది అతడిపై దాడికి పాల్పడింది. తీవ్రగాయాలు కాగా, భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

లింగ నిర్ధారణ కేసులో ప్రధాన నిందితుడి విచారణ

చింతకాని,మార్చి10(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ కేసు జిల్లా వ్యాప్తంగా రోజురోజుకు తీవ్ర చర్చాంశనీయం అవుతుండటంతో పోలీసులు కేసుపై దృష్టిసారించారు. ఈ కేసుకు సంబంధించిన ప్రధాన నిందితుడు ఖమ్మం నగరం పాండురంగాపు చెందిన సల్లోజు వెంకటేష్ అలియాస్ ఆర్ఎంపీ చారి శనివారం పోలీస్ నోటీస్ అందుకున్నారు. ఈ నేపథ్యంలో చింతకాని పోలీసులు ఎదుట సోమవారం హాజరయ్యాడు. అనంతరం చారిని విచారణ నిమిత్తం వైరా ఏసీపీ కార్యాలయానికి తరలించారు. మరిన్ని వివరాలు, లింగ నిర్ధారణలో మరింత మంది పాత్రపై పోలీసులు విచారణలో తేల్చనున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఖమ్మంరూరల్, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బారుగూడెం పరిదిలోని శ్రీసిటీలో నివాసముంటున్న పిట్టల సుధాకర్, నిర్మల దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మనీష్ (31) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఏపీలోని ఆళ్లగడ్డలో స్నేహితుడు వివాహనికి శనివారం వెళ్లాడు. పెళ్లి వేడుక నుంచి స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి కారులో వెళుతున్నాడు. ఆళ్లగడ్డ వద్ద కారు ప్రమాదానికి గురై మనీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మనీష్‌కు ఏడాది క్రితమే వివాహం జరిగింది. మనీష్ మృతదేహం మంగళవారం ఖమ్మం చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

16,680 మంది విద్యార్థులు హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఆంగ్ల పరీక్ష నిర్వహించారు . మొత్తం జనరల్ విద్యార్థులు 14999 మందికి 14682 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఓకేషనల్ విద్యార్థులు 2079 మందికి 1998 మంది హాజరయ్యారు. మొత్తం 17078 మంది విద్యార్థులకు 16680 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 398 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె రవిబాబు తెలిపారు. 40 పరీక్షా కేంద్రాలను హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీలు చేశారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి10(ఆంధ్రజ్యోతి): మూడునెలల తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఈవీఎం గోడౌన్‌ను సోమవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. నియోజకవర్గాల వారీగా ఉన్న బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లు భద్రపరిచిన గదులను, మొదటి అంతస్తులో భద్రపరిచిన వీవీ. ప్యాట్ గది సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో పరిశీలించారు. భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గత ఎన్నికల్లో వాడిన స్టాట్యూటరీ సామగ్రి కాకుండా ఇతర సామగ్రిని అవసరం మేరకు వినియోగించాలని, పనికిరాని వానిని స్క్రాప్‌గా తొలగించాలని సూచించారు. వెపన్‌బ్యారక్‌తో పాటు కావాల్సిన సౌకర్యాలకు ఆదేశించారు. రిజిస్టర్లను పరిశీలించి తనిఖీ రిజిస్టర్‌లో సంతకం చేశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్ స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఎన్. తిరుమలరావు, పి.శ్రీనివాస్, లింగనబోయిన సతీష్ బాబు, కె.ఏ.స్వామి కుమార్,ఏ.గోపాల్‌రావు, సిహెచ్. నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలని వినతి

తిరుమలాయపాలెం, మార్చి10(ఆంధ్రజ్యోతి): తిరుమలాయాపాలెం గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు అందించిన ఇంటిస్థలాల పట్టాలను పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం అందించారు. గ్రామంలో సుమారు 130మందికి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది కానీ వారికి ఇంటిస్థలాలు కేటాయించ లేదని తెలిపారు. ప్రభుత్వం స్థలాలు చూపకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాస్తవంగా 70గజాలు ఇంటి పట్టాలు ఇచ్చారుకానీ, 120గజాలు ఇవ్వాలని వివరించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్‌నాయకులు కొమ్ము వీరబాబు, చిరంజీవి, కొండల్, కొమ్ము బుచ్చిరాములు, వీరన్న పాల్గొన్నారు.. అదేవిదంగా ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని కోరుతూ బీఎస్పీ, డీఎస్పీ పార్టీలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో మట్టే నాగేశ్వరరావు, కొమ్ము పూలే, సురేష్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెండో కౌంటర్

- ఆలస్యంగా హాజరైన అధికారుల ఒక రోజు వేతనం కట్
- కమిషనర్ అభిషేక్ అగస్త్య



ఫిర్యాదులు పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ కౌంటర్‌కు అదనంగా రెండో కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రజావాణిలో వచ్చే సమస్యలకు ఒక్కరోజులోనే పరిష్కారం చూపాలని, లేకుంటే కారణాలను తెలియజేయాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. ఖమ్మం నగర పాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. ఒక సమస్యపై ప్రజలు ఒక్కసారి వస్తే పరిష్కారం జరగాలని, పదేపదే ప్రజలు రావటం వల్ల వారికి ఇబ్బందులు ఏర్పడతాయని సంబంధిత అధికారులను హెచ్చరించారు. టేకులపల్లికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటికి అదనంగా ట్యాక్స్ వచ్చిందని ఫిర్యాదు చేశారు. పరిశీలించి ట్యాక్స్ తగ్గించాలని ఆర్వో శ్రీనివాసరావును కమిషనర్ ఆదేశించారు. జగజ్జీవన్‌రావు కాలనీకి చెందిన ప్రజలు తమ నివాసాలకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని కోరారు. 45వ డివిజన్‌లో కమర్షియల్ వ్యాపారులు సైడ్ డ్రైనేజీల్లో చెత్త పడేయటం ద్వారా మురుగు నీరు నిల్వలు పెరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు.

ఆలస్యంగా వచ్చిన అధికారుల వేతనాలు కట్

అయితే వారంతపు రోజుల్లో వరంగల్, హైదరాబాద్ నుంచి రాకపోకలు నిర్వహించే అధికారులు ప్రతి సోమవారం కేఎంసీ కార్యాలయానికి ఆలస్యంగా వస్తున్నారు. సోమవారం కూడా ప్రజావాణికి సమయానికి హాజరు కాని అధికారులకు ఒకరోజు వేతనాలను కట్ చేయాలని ఆదేశించారు. సమయ పాలన పాటించకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

ఎల్ఆర్ఎస్‌కు అదనపు కౌంటర్లు

ఖమ్మం నగర పాలక సంస్థకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు వచ్చే దరఖాస్తు దారుల సంఖ్య అధికంగా ఉండటంతో వారి వద్దకు వెళ్లిన కమిషనర్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఉన్న ఎల్ఆర్ఎస్ కౌంటర్‌కు అదనంగా రెండో కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను కమిషనర్ అభిషేక్ ఆదేశించారు.

పూలే జయంతి, వర్ధంతిని
అధికారికంగా నిర్వహించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి10(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే జయంతిని, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ కృష్ణారావు అన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఖమ్మంనగరంలోని ఆర్అండ్‌బీగెస్ట్ హౌస్ వద్దగల పూలే ప్రాంగణంలో పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. సావిత్రిబాయిపూలేకు ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు, కళాశాలల్లో సావిత్రిబాయిపూలే చిత్రపటాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమాజంలో మహిళ విద్యపట్ల వ్యతిరేకత ఉన్న కాలంలో తొలి భారతీయ మహిళ ఉపాధ్యాయురాలిగా ఎదిగి మహిళలకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈకార్యక్రమంలో బీఎస్పీజిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, పెళ్లూరి విజయ్‌కుమార్, మిర్యాల నాగరాజు, బాసాటి హనుమంతరావు, గద్దె వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు. వీరనారీమణుల ఆశయసాధన సమితిఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రాబాయి, భూక్యా జ్యోతి, విజయ,ప్రియాంక, ఝాన్సీ పాల్గొన్నారు.



పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఫోరం నాయకులు

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పూలేప్రాంగణంలో పూలే దంపతుల విగ్రహాలకుపూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ పెరుగు వెంకటరమణయాదవ్, చేకూరి చైతన్య, జి.నరేందర్, తీగల రాము, చల్ల హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మీ మొబైల్‌లోనే.. మీ ఎల్ఆర్ఎస్ వివరాలు

స్కాన్ చేయండి

31-03-2025 లోపు

SCAN HERE FOR LRS CITIZIEN LOGIN

దరఖాస్తుల పరిశీలన స్కానర్

స్కానర్ విడుదల చేసిన ప్రభుత్వం

ఖమ్మంసంక్షేమ విభాగం,మార్చి10 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో దరఖాస్తుదారులు నేరుగా తమ సెల్‌ఫోన్‌లో పూర్తి సమాచారం పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిటిజన్ లాగిన్ అవకాశం ఏర్పాటు చేసింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు తమ రిజిస్ట్రేషన్ ఫోన్ నెంబర్ ద్వారా తెలిగ్గా లాగిన్ జరిగి స్వయంగా సెల్‌ఫోన్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు స్టేటస్‌ను పరిశీలన చేసుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర పురపాలకశాఖ అధికారులు ప్రత్యేకంగా స్కానర్‌ను సైతం విడుదల చేశారు. ఈనెల 31 వరకు ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించిన వారికి 25శాతం రాయితీ ఇవ్వటంతో దరఖాస్తుల పరిశీలనకు తాకిడి పెరిగింది. దీంతో దరఖాస్తుదారులు కొద్ది పాటి సాంకేతిక విజ్ఞానంతోనే ఇంట్లోనే ఉండి తమ మొబైల్ ఫోన్‌లో పరిశీలన చేసుకోవచ్చని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం ప్రకటించారు.



దరఖాస్తుల లాగిన్ విధానం

అంధత్వ నివారణ కోసం కృషి చేయాలి

ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ఖమ్మంకలెక్టరేట్, మార్చి10(ఆంధ్రజ్యోతి): అంధత్వ నివారణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ సూచించారు. సోమవారం జాతీయ అంధత్వ నివారణ ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 40 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ తరచుగా కంటి చూపును పరిక్షించుకుని అద్దాలు వినియోగించాలన్నారు. వెలుతురు చుట్టూ రంగుల వలయాలు కనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రాథమిక దశలో జబ్బు లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు రామూనాయక్, ఆయేషాబేగం, రాజశేఖర్, ఆస్మ శ్రావణి, ఆప్తాల్మిక్, అసిస్టెంట్‌లు వీణ, నరేష్ పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

రౌడీ మూకల హల్‌చల్

- ఇల్లు ఖాళీ చేయాలని దౌర్జన్యం

ఖమ్మంక్రైం,మార్చి10(ఆంధ్రజ్యోతి):నగరంలో కొంతమంది రౌడీమూకలు హల్‌చల్ చేసిన సంఘటన ఆదివారం ఖమ్మం నగరంలో జరిగింది. బాధితుల వివరాలు ప్రకారం... నగరంలోని మధురానగర్‌లో నివాసం ఉంటున్న నర్వనేని నరేష్ వ్యాపారం నిమిత్తం 11నెలల క్రితం రూరల్ మండలం లోని మంగళగూడెం గ్రామానికి చెందిన ఒకరి వద్ద రూ.1.30కోట్లు అప్పుగా తీసుకున్నారు. అందుకు తనఖాగా మిర్యాలగూడేనికి చెందిన హైదరాబాద్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహించే ఓ వ్యక్తికి ఇంటిని రిజిస్ట్రేషన్ చేశారు. ఆ డబ్బులు విషయమై ఆలస్యం కావడంతో ఇంటిని ఖాళీ చేయాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని బాధితులు తెలిపారు. ఇంటి విలువ సుమారు రూ.3కోట్లు ఉంటుంది.. అది అమ్మి డబ్బులు చెల్లిస్తానని చెప్పినా కూడా వినకుండా నగరానికి చెందిన కొంత మంది రౌడీలు ఇంటివద్దకు ఆదివారం వచ్చి ఇంటిని ఖాళీ చేయాలని తలుపులు నెట్టుకుని లోనికి వచ్చారు. ఇంటిలోని మహిళలు అని కూడా చూడకుండా బయటకు లాగి పడేశారు. బతిమిలాడినా వినకుండా బెదిరించారు. వెంటనే సదరు కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేయడంతో ఖానాపురం హవేలి పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకున్నారు. తరువాత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఖానాపురం హవేలి సీఐ భానుప్రకాష్‌ను అడుగగా ఇల్లు అమ్మినట్టుగా సదరు ఏఎస్సై బంధువుల వద్ద కాగితాలు ఉన్నాయన్నారు. ఇంటికి వచ్చి గొడవ జరిగిన మాట వాస్తవమేనని, ఈ కేసును విచారణ చేస్తున్నట్టు తెలిపారు.



ఇంటిలో గొడవ చేస్తున్న రౌడీమూకలు

పాకలగూడెంలో ఆభరణాల చోరీ

సత్తుపల్లిరూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం పాకలగూడెంలో ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. గ్రామంలోని రాచకొండ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న హైదరాబాద్ లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 12గ్రాముల బంగారం, 30తులాల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

బిల్లుపాడు మాజీ ఎంపీటీసీ మాలతి మృతి

తల్లాడ, మార్చి10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నల్లమోతు మాలతీ(49) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మాలతీ 2014 నుంచి 2019వరకు బిల్లుపాడు ఎంపీటీసీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మాలతీ మృతి పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, సొసైటీ చైర్మన్ దిరిశాల నర్సింహారావు, నాయకులు దుండేటి వీరారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), దీవెల కృష్ణయ్య తదితరులు సంతాపం తెలిపారు.



చివరి భూములు తడిసే వరకు నీరందిస్తాం

- ఎస్ఈ వాసంతి

బోనకల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాలువల కింద రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి చివరి భూములు తడిసే వరకు నీరందిస్తామని ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి స్పష్టం చేశారు. మండలంలోని బీబీపీ పై సోమవారం ఆమె పర్యటించారు. కాలువల నీటి పారుదల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆళ్లపాడు మైనర్ వరకు వెళ్లి నీటి తడుల గురించి వివరాలు సేకరించారు. రైతుల విజ్ఞప్తి మేరకు బీబీసీకి మరో 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా చూడాలని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడారు. నీటిని వృథా చేయకుండా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎగువ, దిగువ రైతులు సమన్వయంతో తడులు పెట్టుకోవాలన్నారు. అధికారులు కాలువల పై పర్యటిస్తూ నీటి పారుదలను పకడ్బం దీగా రైతుల భూములకు అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఎస్ఈ స్థాయి అధికారి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు బీబీసీ పై పర్యటించి తమ బాధలకు స్పందించి నీటి విడుదల చేయించినందుకు గాను ఆళ్లపాడు రైతులు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సీహెచ్. రామకృష్ణ, డీఈఈ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి

కృష్ణప్రసాద్ పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

ఖమ్మంక్రైం, మార్చి10(ఆంధ్రజ్యోతి): నగరంలోని పోలీసుహెడ్ క్వార్టర్స్ ఆవరణలోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో సోమవారం వైజ్ఞానిక ప్రదర్శనశాల నిర్వహించారు. దీని నిస్కూల్ చైర్‌పర్సన్ నిషాశర్మ ప్రారంభించారు. సాంకేతిక రంగాలలో పరిశోధన ప్రాజెక్టులను రూపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు, ముఖ్యవేదికలుగా నిలుస్తున్నాయని, ఆమె అన్నారు. విద్యార్థుల ప్రాజెక్టులను ఆమె తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఏసీపీ నరసయ్య, ఆర్ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న నిషాశర్మ

రైతులకు పరిహారం చెక్కుల అందజేత

వేంసూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుగూడెంలో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు దారి ఇచ్చిన రైతులకు ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు సరైన దారి సౌకర్యం లేదు. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు దారి ఇచ్చేందుకు రైతులు ముందుకువచ్చారు. ఈమేరకు ఐదుగురు రైతులకు నష్టపరిహారం కింద చెక్కులు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచూరి గంగరాజు, తుంబూరి రామిరెడ్డి, సోమిరెడ్డి, వనమారెడ్డి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అండగా ఉంటాం

● టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు



అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మం, మార్చి10 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవపున్నయ్యలు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నియంత పోకడలను వ్యతిరేకిస్తూ 2006లో ఫెడరేషన్ ఆవిర్భవించిందని, ఆనాటి నుంచి నేటి వరకు టీడబ్ల్యూజేఎఫ్ చేస్తున్న పోరాటాలను జర్నలిస్టులు ఆకర్షితులవుతున్నారన్నారు. జర్నలిస్టుల ప్రతీ సమస్యపై నికరంగా పోరాడేది ఒక్క టీడబ్ల్యూజేఎఫ్ మాత్రమేనన్నారు. ఖమ్మంలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు చేరడం హర్షనీయమ న్నారు. సభ్యత్వం తీసుకుని యూనియన్‌ను బలోపేతం చేసిన ప్రతీ ఒక్క జర్నలిస్టుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఫె డరేషన్ అధ్యక్షుడు పల్లా కొండలరావు అధ్యక్షతన సాగిన ఈ సభలో నూతనంగా చేరిన పలు వురు జర్నలిస్టులు ప్రసంగించారు. తొలిరోజు 196 మంది జర్నలిస్టులు సభ్యత్వం తీసుకోగా.. 285 మంది సభలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు రాజశేఖర్, రాష్ట్ర నాయకులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్‌కుమార్, గుడిగ రఘు, ఆర్ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యం

తల్లాడ, మార్చి10(ఆంధ్రజ్యోతి): విత్తన తయారీకి వినియోగించే మొక్కజొన్న సాగు చేసిన రైతులు కొనుగోళ్లలో జాప్యం వలన పడిగాపులు కాస్తున్నారు. తల్లాడ మండలం నారాయణపురం వద్ద వేబ్రిడ్జిలో ఓ కంపెనీకి చెందిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కొనుగోలు కేంద్రానికి అమ్మకానికి వచ్చిన మొక్కజొన్న కొనుగోళ్లలో రోజులతరబడి జాప్యం జరుగుతుంది. దీంతో మొక్కజొన్న లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లతో రైతులు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. తల్లాడ మండలంలోని నారాయణపురం, మంగాపురం, రెడ్డిగూడెం, తల్లాడ గ్రామాల్లో రైతులతో విత్తన కంపెనీ ప్రతినిధులు సాగుకుముందే కొనుగోలు ఒప్పందం చేసుకోవడంతో మొక్కజొన్న సాగుచేశారు. మొక్కజొన్న సాగు కోసం ఎకరాకు రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం మొక్కజొన్న కంకి విరిచే దశలో ఉంది.ఎకరాకు 30నుంచి40క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తుంది. క్వింటాలు రూ.3 వేల నుంచిరూ.4వేల వరకు ధర ఉంది.

కాలక్షేప మండపాన్ని ప్రారంభించిన మేయర్

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని సుగ్గులవారి తోట శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం ఆలయలో సోమవారం కాలక్షేప మండపాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు.భక్తుల విరాళాలతో ఈ నిర్మాణం పూర్తి చేశారు. నంతరం మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో మేయర్ నీరజ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ పమాయ కమిషనర్ యం వీరస్వామి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు బాదంపూడి పార్వతీవం శర్మ ఆధ్వర్యంలో విఘేశ్వర పూజ, నవగ్రహ ఆరాధన, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శేషగిరి, ఈఓలు వివి నరసింహారావు, వేణుగోపాలచార్యులు, వ్యవస్థాపక ధర్మకర్త పూరణచంద్రరావు, భక్తమండలి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మండపాన్ని ప్రారంభిస్తున్న మేయర్

రూ.725కోట్లతో అభివృద్ధి పనులు



ఐకేపీ కార్యాలయంలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మంజూరైన రూ.725కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రితో పాటు జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో అన్నిరంగాలలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీలో రూ.1009..33లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా నియోజకవర్గంలో కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ రూ.240కోట్లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ రూ.200కోట్లు, ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ రూ.24కోట్లు, ఈజీఎస్ నిధులు రూ.30కోట్లతో పాటు బీటీ, సీసీ రోడ్లకు నిర్మిస్తున్నట్లు చేప్పారు. కిష్టారంలో రూ.70లక్షలు, రామానగరంలో రూ.38లక్షల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో స్వయం సహాయ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్పత్తులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వేంసూరులో...

వేంసూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపాడు గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే రాగమయి సోమవారం శంకుస్థాపన చేశారు. ఎస్టీ సబ్‌ప్లాన్ కింద డ్రెయినేజీ నిర్మాణానికి రూ.94లక్షలు మంజూరు చేశారు. ఈ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, సోమిరెడ్డి, గడ్డం జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రికార్డులను నిర్వహించాలి

● డీఎల్‌పీవో రాంబాబు

చింతకాని, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ రికార్డులను క్రమం తప్పకుండా నిర్వహించాలని డీఎల్‌పీవో రాంబాబు సూచించారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో పర్వీన్ కైసర్, కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కంటి వైద్య శిబిరం

సత్తుపల్లి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని సింగరేణి సంస్థకు చెందిన పీవీ.నరసింహారావు సెంటినరీ కాలనీలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఖమ్మానికి చెందిన శరత్ మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 154మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. కంటి శుక్లాలు ఉన్నవారికి సర్జరీ అవసరమని గుర్తించామని పీవో ప్రహ్లాద్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘ నాయకులు, ఆస్పత్రి బాధ్యులు పాల్గొన్నారు.

బిల్లుపాడు మాజీ ఎంపీటీసీ మాలతి మృతి



తల్లాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నల్లమోతు మాలతీ(49) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మాలతీ 2014నుంచి 2019వరకు బిల్లుపాడు ఎంపీటీసీ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మాలతీ మృతి పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షులు దగ్గుల రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, సొసైటీ చైర్మన్ దిరిశాల నర్సింహారావు, నాయకులు దుండేటి వీరారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), దీవెల కృష్ణయ్య తదితరులు సంతాపం తెలిపారు.

జ్వరంతో వ్యక్తి ....



శ్రీనివాసరావు

పెనుబల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్లబంజర గ్రామంలో వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎడ్లబంజర గ్రామానికి చెందిన బన్నే శ్రీనివాసరావు (35) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఆదివారం జ్వరం ఎక్కువ కావడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

పాకలగూడెంలో చోరీ

సత్తుపల్లిరూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం పాకలగూడెంలో ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. గ్రామంలోని రాచకొండ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 12గ్రాముల బంగారం, 30తులాల వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

సావిత్రిబాయి వర్ధంతి

మధిర రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మడుపల్లి హెచ్‌డబ్ల్యూఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతిని సోమవారం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం అప్పారావు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు మహాసభను జయప్రదం చేయాలి

మధిర రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో ఈనెల 12న జరుగనున్న రైతు సంఘం మధిర మండలం మహాసభను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పంగా శేషగిరి, చావా మురళీ కోరారు. సోమవారం మడుపల్లిలో జరిగిన ఆసంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఉదయం పదిగంటలకు మడుపల్లి సీపీఐ కార్యాలయంలో ఈ మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రమబద్ధీకరణ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

తల్లాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటిస్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసిన వారందరికీ 25శాతం రాయితీ కల్పించడం జరుగుతుందని తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020వ సంవత్సరంలో దరఖాస్తు చేసిన వారందరూ ఈనెల 31లోపు క్రమబద్ధీకరణ చేసుకున్నట్లయితే రాయితీ పొందవచ్చునన్నారు. ఎవరైతే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారో వారందరూ కూడా సంబంధిత పంచాయతీ కార్యదర్శిని సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రయాణించేదెలా..

» గ్రామాల్లో అధ్వానంగా రహదారులు
» పట్టించుకోని అధికారులు
» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
» మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



కంకర తేలిన మత్కేపల్లి రోడ్డు

చింతకాని, మార్చి10(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కంకర తేలిన రోడ్లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని మత్కేపల్లి నామవరం క్రాస్ రోడ్డు నుంచి ముదిగొండ మండలం గోకినేపల్లి వరకు సుమారు రూ.30 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి చింతకాని మండల పరిధిలో నామవరం క్రాస్ రోడ్డు నుంచి మున్నేటి వరకు రహదారి నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. వా టర్ క్యూరింగ్ చేయకపోవడంతో దుమ్ము, ధూళితో కంకర వేసిన రోడ్డుపై రోజూ ప్రయాణికులు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఒక్కోసారి పెద్ద వాహనాలు వచ్చినప్పుడు టైరు ఎక్కినప్పుడు కంకర రాళ్లు లేచి వాహనదారులకు తగిలి గాయాలపాలవుతన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బోనకల్ మండలంలో...

బోనకల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామ శివారు ప్రాంతం నుంచి ముష్టికుంట్ల వరకు గల రోడ్డు మార్గం పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా మారింది. నిత్యం ఈ మార్గం ద్వారా చొప్పకట్లపాలెం, ముష్టికుంట్ల గ్రామ ప్రజలతో పాటు ఆంధ్రా నుంచి పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చొప్పకట్లపాలెం నుంచి ముష్టికుంట్ల గ్రామం మీదుగా జిల్లా కేంద్రానికి ప్రజలు, విద్యార్థులు ఆసుపత్రులు, కళాశాలలు, పనుల నిమిత్తం రోడ్డు మార్గం ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. నాడు డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేయించిన నిధులతో వేయించిన రోడ్డుకు దశాబ్ధ కాలంగా పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో నేడు అధ్వాన స్థితికి చేరుకుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడానికి నరక యాతన పడుతున్నారు. ప్రభుత్వం తమ రోడ్డును పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంతలమయంగా ఉన్న చొప్పకట్లపాలెం-ముష్టికుంట్ల రహదారి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

• తిరుపతి ప్రసాద్ మత్కేపల్లి గ్రామం

గ్రామం నుంచి ఖమ్మం, చింతకాని మండల కేంద్రానికి వెళ్లాలంటే వెళ్లలేకపోతున్నాం. కంకర తేలడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వాహనదారులు ఒక్కోసారి కంకర రాళ్లు తగిలి కిందపడి గాయాలపాలవుతున్నారు. ప్రజాప్రతినిధులకు రోడ్డు బాగు చేయించాలని ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు పనులు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలి.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

• బంధం నాగేశ్వరరావు, ముష్టికుంట్ల



మా గ్రామం నుంచి చొప్పకట్ల పాలెం వరకు గల రహదారి పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా మారింది. పొలాలకు వెళ్తున్న రైతులతో పా టు పనుల నిమిత్తం ఆంధ్రా ప్రాంతానికి వెళ్లడానికి రోడ్డు మార్గం ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. బీటీ వేసేందుకు నిధులు మంజూరు చేస్తే ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయి.

వైరా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200కోట్ల మంజూరు

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన వైరాలో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ.200కోట్ల నిధులు మంజూరయ్యాయని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. వైరాలోని తమ క్యాం పు కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌కు లేద న్నారు. తన స్థాయిని గుర్తెరిగి మాట్లాడాలని ధ్వజమెత్తారు. మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలోని పుణ్యపురం గ్రామంలో రూ.5.45కోట్ల విలువైన 109 ఇందిరమ్మ గృహాలకు శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. ఈ నిధులు మంజూరు చేసిన సీఎం, డిప్యూటీ సీఎంలు రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలోని బీఆర్‌ఎస్ నాయకులు మరీ ముఖ్యంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తన స్థాయిని మరిచి కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, జిల్లాకు చెందిన మంత్రులపైనా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీతరామ ప్రాజెక్టుకు వేలాదిరూపాయలు ఖర్చుచేసి చుక్కనీరు కూడా అందించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో సీతారామ నుంచి గోదావరి జలాలను సాగర్‌కాల్వకు పారించడం జరిగిందన్నారు. ఇది చూసి ఓర్వలేని తాతా మధుసూదన్ అవాకులు చవాకులు పేలుతున్నారని విమర్శించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఏడులక్షల కోట్ల పైచిలుకు అప్పులుపాలు చేశారని వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెలా వేలాదిరూపాయలను వడ్డీ కింద తీర్చాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, ఉపకార వేతనాల పెంపు, రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల మంజూరు వంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు కట్ల రంగారావు, దాసరి దానియేలు, పమ్మి అశోక్, బొళ్ల గంగారావు, బీడీకే.రత్నం, మచ్చా బుజ్జీ, పల్లపు కొండలు, వీరంశెట్టి సీతరాములు, మచ్చా రామారావు, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, శీలం సురేందర్‌రెడ్డి, గద్దే మల్లికార్జున్, మల్లు రామకృష్ణ, నాగనబోయిన కృష్ణ, నర్వనేని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చివరి భూములు తడిసే వరకు నీరందిస్తాం

» ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి

బోనకల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కాలువల కింద రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి చివరి భూములు తడిసే వరకు నీరందిస్తామని ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి స్పష్టం చేశారు. మండలంలోని బీబీసీ పై సోమవారం ఆమె పర్యటించారు. కాలువల నీటి పారుదల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆళ్లపాడు మైనర్ వరకు వెళ్లి నీటి తడుల గురించి వివరాలు సేకరించారు. రైతుల విజ్ఞప్తి మేరకు బీబీసీకి మరో 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేలా చూడాలని ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడారు. నీటిని వృథా చేయకుండా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎగువ, దిగువ రైతులు సమన్వయంతో తడులు పెట్టుకోవాలన్నారు. అధికారులు కాలువల పై పర్యటిస్తూ నీటి పారుదలను పకడ్బందీగా రైతుల భూములకు అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఎస్ఈ స్థాయి అధికారి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు బీబీసీ పై పర్యటించి తమ బాధలకు స్పందించి నీటి విడుదల చేయించినందుకు గాను ఆళ్లపాడు రైతులు ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సీహెచ్. రామకృష్ణ, డీఈఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, ఏఈఈలు రాజేష్, ఏడుకొండలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు

ఏన్కూరు, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఎస్సీవర్గీకరణ జరిగేవరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరవధిక దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు యంగల నరేష్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లలో కూడా వర్గీకరణను వర్తింపచేసి ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏబీసీడీ వర్గీకరణ అనంతరం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గొడ్ల రామకృష్ణమాదిగ, మంగళపుడి రాజ్‌కుమార్ మాదిగ, పగిడిపల్లి సైదులు మాదిగ, కిన్నెర సురేష్‌మాదిగ, చిలుకూరి రాజేష్‌మాదిగ, ఏర్పుల సురేష్ మాదిగ, మారబత్తులు రాకేష్‌మాదిగ, యంగళ ప్రసన్నకుమార్‌మాదిగ, సురేందర్ మాదిగ, కృష్ణమాదిగ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కుల అందజేత

వేంసూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుగూడెంలో నిర్మించనున్న పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు దారి ఇచ్చిన రైతులకు ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. పామాయిల్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు సరైన దారి సౌకర్యం లేదు. దీంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు దారి ఇచ్చేందుకు రైతులు ముందుకువచ్చారు. ఈమేరకు ఐదుగురు రైతులకు నష్టపరిహారం కింద చెక్కులు అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచూరి గంగరాజు, తుంబూరి రామిరెడ్డి, సోమిరెడ్డి, వనమారెడ్డి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ఎర్రుపాలెం, మార్చి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో నారాయణపురం గ్రామానికి చెందిన కోగంటి రజిత విద్యార్థులకు క్రీడాదుస్తులను సోమవారం వితరణ చేశారు. పాఠశాలలో విద్యార్థులు క్రీడల్లో చూపుతున్న ప్రతిభను గమనించి సుమారు రూ.10వేల విలువైన క్రీడా దుస్తులను అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు గుర్తింపు తేవాలని కోరారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.యశోద, గ్రామస్థులు కోగంటి సత్యనారాయణ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-1లో యువకుడి ప్రతిభ



సందీప్

కల్లూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యర్రబోయనపల్లి గ్రామానికి చెందిన దొడ్డపునేని సందీప్ తాజాగా సోమవారం ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో 502 మార్కులు పొంది అర్హత సాధించారు. మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామానికి చెందిన సందీప్ ప్రస్తుతం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్‌శాఖలో 2019లో ఎస్‌ఐగా ఉద్యోగం పొందారు.

'ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

సత్తుపల్లి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీలను గ్రూప్-1,2,3లుగా వర్గీకరిస్తే ఇబ్బందులు వస్తాయని, వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలంటే 59ఉపకులాలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, ఇసినేపల్లి అశోక్, కూరపాటి సునీల్, తురింటి అంజయ్య కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పిలుపుమేరకు నిరసన కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి పాతసెంటర్ నుంచి రింగ్‌సెంటర్ వరకు మాదిగల మహాఆత్మగౌరవ డప్పు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొలికపోగు వెంకటేశ్వరరావు, నల్లంటి అశోక్, గొల్లమందల ముత్తారావు, గొళ్లమూడి శ్రీనివాస్, కోటమర్తి బాలస్వామి, మాగంటి శ్రీనివాస్, మేడి నాగేశ్వరరావు, ఎక్కిరాల నాగేశ్వరరావు, దారిల్లి వెంకటేశ్వర్లు, బొక్క వెంకటేశ్వరరావు, కొండూరు రాజేష్, జొన్నలగడ్డ నవీన్ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీ ఎంపిక

కల్లూరు, మార్చి10 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల బాలల పరిరక్షణ కమిటీ ఎంపిక సోమవారం జరిగింది. తహసీల్దార్ కార్యాలయంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్స్టిట్యూషనల్ కేర్ సోనీ పేమాలీనా ఆధ్వర్యంలో ఈ కమిటీ ఎంపిక జరిగింది. వీవోపీసీ చైర్‌పర్సన్‌గా సునీత (మండల ప్రత్యేక అధికారి), కార్యదర్శిగా సాంబశివుడు (తహసీల్దార్), సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో రత్తమ్మ, సూపర్‌వైజర్ బి. వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

» సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి వీరభద్రం

కొణిజర్ల, మార్చి10(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం వైరా మునిసిపాలిటి పరిధిలోని పల్లిపాడులో సోమవారం సీపీఎం బృందం పర్యటించింది. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు మాట్లాడుతూ రెక్కలకష్టం మీద బతికే పేదలకు మునిసిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ పథకం పనులు లేకుండా కేంద్ర ప్రభుత్వం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 12న మునిసిపల్ కార్యాలయం వద్ద మహాధర్నా కార్యక్రమం ఉంటుందని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిరన్న, పారుపల్లి శ్రీనాథ్ బాబు, దామా వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం బృందం

నారాయణ ఆశయాలు సాధించాలి



మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

చింతకాని మార్చి 10(ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు పంది నారాయణ ఆశయ సాధనకు కార్యకర్తలు పాటుపడాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో సీపీఐ నాయకులు కామ్రేడ్ పంది నారాయణ 37వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల సమస్యలపై పోరాటాలు నిర్వహించి పేదల పెన్నిధిగా పంది నారాయణ నిలిచారన్నారు. 1988 గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రత్యర్థుల చేతిలో మరణించారని, ఖమ్మం పాత తాలుకాలో పార్టీ నిర్మాణానికి తీవ్రంగా కృషిచేశాడన్నారు. పంది నారాయణ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, పదిమల వెంకటనర్సయ్య, షేక్ చిన్న జాన్, పంది నాగేశ్వరరావు, చాట్ల ముఖర్జీ, వజీర్, భాస్కర్, రమేష్, బోజడ్ల శేషగిరిపాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కల్లూరు, మార్చి10 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ప్రతిభ విద్యాలయంలో సోమవారం పలు అంశాలపై విద్యార్థులచే నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వాతావరణ కాలుష్యం, నీటి సంరక్షణ, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రమాదాల నివారణ, రీసైక్లింగ్ తదితర అంశాలపై రూపొందించిన 87 నమూనాలను వారు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రతిభ విద్యా సంస్థల కరస్పాండెంట్ లక్కినేని రఘు, పాఠశాల డైరెక్టర్ లక్కినేని ప్రసాద్‌లు మట్లాడుతూ నిజ జీవితంలో సైన్స్ మానవ జీవనాన్ని ఎంతగా ప్రభావితం చేస్తుందో విద్యార్థులకు వివరించారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యం



కొనుగోలు కేంద్రం వద్ద బారులు తీరిన ట్రాక్టర్లు, లారీలు

తల్లాడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విత్తన తయారీకి వినియోగించే మొక్కజొన్న సాగుచేసిన రైతులు కొనుగోళ్లలో జాప్యం వలన పడిగాపులు కాస్తున్నారు. తల్లాడ మండలం నారాయణపురం వద్ద వేబ్రిడ్జిలో ఓ కంపెనీకి చెందిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. కొనుగోలు కేంద్రానికి అమ్మకానికి వచ్చిన మొక్కజొన్న కొనుగోళ్లలో రోజులతరబడి జాప్యం జరుగుతుంది. దీంతో మొక్కజొన్న లోడ్‌తో ఉన్న ట్రాక్టర్లతో రైతులు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. తల్లాడ మండలంలోని నారాయణపురం, మంగాపురం, రెడ్డిగూడెం, తల్లాడ గ్రామాల్లో రైతులతో విత్తన కంపెనీ ప్రతినిధులు సాగుకు ముందే కొనుగోలు ఒప్పందం చేసుకోవడంతో మొక్కజొన్న సాగుచేశారు. మొక్కజొన్న సాగు కోసం ఎకరాకు రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం మొక్కజొన్న కంకి విరిచే దశలో ఉంది. ఎకరాకు 30నుంచి 40క్వింటాళ్ల మేరకు దిగుబడి వస్తుంది. క్వింటాలు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ధర ఉంది. రెండువారాల క్రితం విత్తన కంపెనీ మొక్కజొన్న కొనుగోలు కోసం కేంద్రాన్ని ప్రారంభించింది. విరిచిన మొక్కజొన్న కంకులను ట్రాక్టర్లలో లోడ్ చేసి రైతులు కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకువస్తున్నారు. కొనుగోలులో జాప్యం వల్ల లోడ్ చేసిన ట్రాక్టర్లతో సహా రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. దీంతో అదనంగా తమపై ట్రాక్టర్ల కిరాయి భారం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి మొక్కజొన్న కొనుగోళ్లలో జాప్యం జరుగకుండా చూడాలని కోరుతున్నారు.

మానవాళి మనుగడను సూచించేది భగవద్గీత

» ఇస్కాన్ (ముంబై) ప్రతినిధి నరసింహ పూజదాస్

సత్తుపల్లిరూరల్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత జీవనగ్రంథమని, మానవాళి మనుగడ, దశ, దిశను సూచించే గ్రంథమని ఇస్కాన్ (ముంబై) ప్రతినిధి నరసింహ పూజదాస్ అన్నారు. భగవద్గీతపై ఇస్కాన్ ఆధ్వర్యంలో వాల్యూ ఆఫ్ ఎడ్యుకేషన్ అంశంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి స్థానిక శ్రీ కృష్ణమందిరంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరు ఏసీపీ ఏ.రఘు, ఎంఈవో నక్కా రాజేశ్వరరావులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కంచేటి రమేష్, సృజన సాహితీ సంస్థ నిర్వహకులు జీ.రామకృష్ణ, బీ.మధుసూదనరాజు పాల్గొన్నారు.